గవర్ల అనకాపల్లిలో జంగిల్ క్లీరెన్స్ పనులు

విశాలాంధ్ర - మునగపాక : మండలంలోని తోటాడ పంచాయతీ, గవర్ల అనకాపల్లి సమీపంలో ఆవ కాలువకు ఆనుకొని ఉన్న రింగ్ రోడ్ లో మంగళవారం జంగిల్ క్లీరెన్స్ పనులను చేపట్టారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు దగ్గరుండి పనులను పరిశీలించారు. జేసీబీ సాయంతో దారిపొడవునా ఉన్న ముళ్ల కంచెలను తొలగించి కాలువలను శుభ్రం చేశారు. వర్షాలు పడుతుండడం దారిలో చెత్తాచెదారం ఎక్కువ కావడంతో అటుగా వెళ్ళేవారికి అసౌకర్యం కలుగుతుంది అని అందుకోసమే ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బొడ్డేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటి సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి మండల స్థాయిలో శిశు సంక్షేమ శాఖ, తహసిల్దారు, పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించి నట్లు తెలిపారు. జిల్లా లో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000మంది బాలురు, 981 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. స్త్రీ పురుష లింగ నిష్పత్తి ఇకపై సచివాలయ పరిధిగా సేకరించాలని ఆదేశించడం అయినది. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు రెండోసారి గర్భం దాల్చిన మహిళల పట్ల శ్రద్ధ ఎక్కువగా చూపించి గర్భనిర్ధారణ జరగకుండా వాళ్లకి అవగాహన కల్పించాలి. చట్టం క్రింద గర్భం ధరించడానికి ముందుగాని తర్వాత గాని లింగ ఎంపికను నేరంగా పరిగణించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఏ లేబరేటరీగాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ (pcpndt.ap.gov.in) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ఎవరూ వెళ్లవద్దని ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఆమె కోరారు. ఆడపిల్ల విలువ అపారమని, మనమంతా కలిసికట్టుగా లింగ వివక్షతకు చరమగీతం పాడుదామని, ఆడపిల్ల రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. ఎఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శ నాలు, తదితర విధాలుగా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. నూతన వధూవరులకు, గర్భవతికి, అత్త మామలకు దీనిపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి, తొలి ప్రయత్నాలలోనే నిలువరిం చాలని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఎం ఎస్ వికె బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ బాలాజీ, డిప్యూటీ డిఎంహెచ్వో జ్యోతి, గైనకాలజిస్ట్ శోభా దేవి ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు.

కేశవరంలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని కేశవరం గ్రామంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసిల్దార్ జి. సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుండి 11 ఫిర్యాదులు అందాయి. ఈ సదస్సులో సర్పంచులు వంకా వెంకటరమణ, మేడిశెట్టి రామ గోవిందు, మేడిశెట్టి రాము, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రప్రసాద్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జెబి పురం రైతు సేవా కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చీడికాడ : మండలం లోని జెబి పురం రైతు సేవా కేంద్రాన్ని మాడుగుల సహాయ సంచాలుకులు వి చిట్టినాయుడు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు ప్రస్తుతం జరుగుతున్న 21వ పశు గణన కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఎన్ని ఇళ్లకు సర్వే పూర్తి చేశారు ఇంకా ఎన్ని ఇళ్లకు సర్వే చేయాలి దానికిగాను ఏ విధంగా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు గ్రామం లో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి డేటా సరిగా తీసుకున్నది లేనిదీ పరిశీలించారు ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా అందుబాటులో ఉన్న గడ్డి పెంపకం పథకం గురించి రైతులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ క్రషింగ్ లోగా కార్మికులు, కర్షకుల బకాయిలు తక్షణమే చెల్లించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్

విశాలాంధ్ర - చోడవరం : గోవాడ సుగర్స్లో సభ్య రైతులు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు క్రషింగ్ కు ముందుగానే చెల్లించాలని ఏ.పీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక మీడియాతో మంగళవారం సమావేశమైన రెడ్డిపల్లి మాట్లాడుతూ గత ఏడాది సభ్య రైతులు సరఫరా చేసిన చెరకు కు చెల్లించాల్సిన బకాయిలు, కార్మికుల వేతన బకాయిలు కలిపి సుమారు రూ.15 కోట్ల మేర తక్షణమే చెల్లించాలన్నారు. సర్వసభ్య సమావేశంలో గత ప్రభుత్వం కంటే చెరకు మద్దతు ధర అధికంగా ఇస్తామని హామీలు ఇచ్చిన కూటమి రాజులు (స్థానిక ఎమ్మెల్యే రాజు, జనసేన నేత పి.వి.ఎస్.ఎన్.రాజు) మాటలు మారుస్తూ కాలం వెళ్ళదీస్తున్నారన్నారు. సుమారు 9 కోట్ల రూపాయలు మేర మొలాసిస్, కో- జనరేషన్ నిల్వలు ఉన్నప్పటికీ కార్మికులు కర్షకుల బకాయిలు చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. అధికారం రాకముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాట ఆడిన కూటమి రాజులు రైతాంగాన్ని మోసం చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో క్రషింగ్ కు ముందుగానే ఎటువంటి బకాయిలు లేకుండా కార్మికులు కర్షకులకు బకాయి చెల్లింపులు కోసం రూ. 89 కోట్ల 80 లక్షలు నిధులు తీసుకు వచ్చి ఫ్యాక్టరీను ఆదుకున్నారన్నారు. కూటమి నేతలు మాటలు తూటాలతో రైతాంగాన్ని, కార్మికులను నమ్మబలికే ఊకదంపుడు ప్రసంగాలే తప్ప, రైతాంగానికి భరోసా కల్పించే విషయాలు లేవన్నారు. గడిచిన మూడేళ్ళుగా చనిపోయిన సభ్య రైతులకు కనీసం నష్టపరిహారం చెల్లించకపోవడం, రైతుల దురదృష్టమా, యాజమాన్యం మొండి వైఖరియా అని ప్రశ్నించారు. కార్మికులు, కర్షకులకు చెల్లించ వలసిన బకాయిలు రూ. 15 కోట్లు తక్షణమే చెల్లించి క్రషింగ్ ప్రారంభించాలన్నారు ఈ కార్యక్రమంలో చెరకు రైతులు అనుబంధ రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సామరస్యంగా భూ సమస్యలు పరిష్కరించుకోవాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - కే కోటపాడు : గ్రామాల్లో భూ వివాదాలను, అన్నదమ్ముల మధ్య ఏర్పడే భూ సమస్యలను అధికారుల వద్ద సామరస్యంగా పరిష్కరించు కోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మంగళవారం ఈ మండలం ఏ భీమవరం గ్రామంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి చైర్మన్ గా తహసిల్దార్ ఎంపీడీవో స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ సభ్యులుగా ఉంటారని అన్నారు. ఈ కమిటీ ప్రతి శనివారం భూవివాదాలను పరిష్కరిస్తారని అన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న భూతగాదాలకు కోర్టుల వరకు వెళ్లడం డబ్బులు ఖర్చు , కాలయాపనతో అనేక ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ప్రభుత్వం ఈ కమిటీల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటితో గ్రామీణ ప్రాంతంలో ఉన్న వారికి సత్వర న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రైతులు మెడకు ఉరికంబంగా ఉన్న ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి అధికారులను నేరుగా గ్రామాలకే పంపడం జరిగిందన్నారు. ఈ సదస్సుల వల్ల చిన్న చిన్న భూ సంబంధించి అనేక సమస్యలను నివారించుకోవచ్చు అన్నారు. భూముల క్రయ విక్రయాలు పెద్దమనుషుల సమక్షంలో రాసుకోకుండా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. భూములకు సంబంధించి సరిహద్దు వివాదాలు ఉన్నట్లయితే ప్రభుత్వం నియమించిన మండల స్థాయి కమిటీలో న్యాయం పొందాలని సూచించారు. అనంతరం గ్రామస్తులు నుండి భూ సమస్యలపై జిల్లా కలెక్టర్ పలు వినతి పత్రాలు తీసుకున్నారు. ఈ సదస్సులో ఆర్డీవో అయేషా దుమా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి తహసిల్దార్ భాగ్యవతి ఎంపీడీవో సాంబశివరావు సర్పంచ్ తర్ర సన్యాసమ్మ ఎంపీటీసీ లక్ష్మి తదితర అధికారులు నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు : శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - నాతవరం : నాతవరం మండలంలోని గిరిజన గ్రామాలకు త్రాగునీరు, కరెంటు, రోడ్లు వంటి మౌలిక వసతులు అందిస్తామని అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం నాడు నాతవరం మండలంలో సుందరకోట గ్రామంలో అయ్యన్న పర్యటించి, ఎన్నికల హామీల మేరకు సుందరకోట , హసనగిరి గ్రామాల మధ్య రూ.2.05 కోట్ల రూపాయలతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సౌరశక్తి ఆధారంగా త్రాగు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, గత ఆరు నెలల్లో నాతవరం మండలానికి రూ.26.85 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించామని, తాండవ రిజర్వాయర్ గేట్లు మరియు కాలవల మరామత్తుల కోసం రూ 1.80 కోట్లు కేటాయించామని, అలాగే మండలంలో నాతవరం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం, చమ్మచింత బాలుర వసతి గృహం మరమతులకు 38 లక్షల కేటాయించామని, గిరిజన గ్రామాలలో కరెంటు సౌకర్యం కల్పిస్తున్నామని, సరుగుడు గ్రామం వద్ద ఉన్న జలపాతంను టూరిజం శాఖ ద్వారా అభివృద్ధి చేసి, పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్ది , స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేటట్లు దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన గిరిజనులకు నెల రోజుల్లో పట్టాలు పంపిణీ చేస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. స్పీకర్ పర్యటించిన ప్రాంతం ఏజెన్సీ ప్రాంతం కావడంతో నర్సీపట్నం డి.ఎస్.పి మోహన్ ఆధ్వర్యంలో 60 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర, స్పెషలాఫీసర్ శిరీష రాణి,తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, ఎంపీపీ లక్ష్మణమూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తెలుగు యువత అధ్యక్షుడు శెట్టి లోవ, బిజెపి నాయకుడు గవిరెడ్డి త్రినాథ్, స్థానిక సర్పంచ్ కొండపల్లి చిన్నతల్లి, జనసేన నాయకుడు వెలగల వెంకటరమణ, పారిశ్రామికవేత్త వెలగా వెంకట కృష్ణారావు, టిడిపి నాయకులు, పట్టెం రాజబాబు పాల్గొన్నారు.

జీవధార్ రక్తదాన శిబిరానికి అధికారులకు ఆహ్వానాలు అందజేసిన సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి

విశాలాంధ్ర - చోడవరం : డిసెంబర్ 24 చోడవరంలో సి.డి.వి.ఎం కమ్యూనిటీ, సద్భావ టీం ఆధ్వర్యంలో జనవరి ఐదున నిర్వహించ నున్న జీవధార్ రక్తదాన శిబిరం విజయ వంతం చేయవలసిందిగా కోరుతూ మంగళవారం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి పలువురు అధికారులకు ఆహ్వానాలు అందజేశారు. సద్భావ టీం సభ్యురాలైన సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి జీవధార్ రక్తదాన శిబిరం ఆహ్వానాన్ని చోడవరం తహశిల్దార్ రామారావు, సబ్ ట్రెజరీ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా గీతాలక్ష్మి మాట్లాడుతూ లిరక్తదానం మరొకరికి ప్రాణదానమని తెలియ జేశారు. తమ సద్భావ టీం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ సామా జిక సేవా కార్యక్రమాన్ని విజయ వంతం చేయా లన్నారు. జనవరి 5న స్థానిక హోర్డింజి రెస్ట్ హౌస్ వద్ద నిర్వహించనున్న స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో పాల్గొనవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సద్భావ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఏక్టిస్ జనరిక్ ఫార్మా కంపెనీలో ప్రమాదం...ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - పరవాడ : ఏక్టిస్ జనరిక్ ఫార్మా కంపెనీలో రసాయనాలు తూలి ఒకరు గాయపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న మణిశంకర్ కంట్లో రసాయనాలు పడ్డంతో అతడు గాయపడ్డాడు. గాయపడ్డ కార్మికుడిని విశాఖలోని ఓ కంటి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కాగా ఫార్మా సిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలపై సమగ్ర విచారణ చేసి వాస్తవాలను వెల్లడించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు ఈ ప్రాంత వాసులను కలవర పెడుతున్నాయన్నారు. ఏక్టిస్ ప్రమాదం కన్నా కొన్ని గంటల వ్యవధిలో రక్షిత్ డ్రగ్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అస్వస్థకి గురయ్యారన్నారు. ఇటీవల మరో కంపెనీ ఠాగూర్ లాబరేటరీలో జరిగిన ప్రమాదంలో 30 మంది అస్వస్థకు గురవుగా అందులో ఇద్దరు కార్మికులు మృతి చెందారని చెప్పారు. అలాగే కెమిక ఫార్మాలో పశ్చిమ బెంగాల్ కి చెందిన ఒక్క కార్మికుడి గాయపడగా, విజయశ్రీలో ఇద్దరు కార్మికులు ఆసుపత్రి పాలయ్యారని పేర్కొన్నారు. ఇంకా స్మైలేక్స్ ఫార్మాలో ఇద్దరు, ఆల్కలీ మెటల్ పరిశ్రమలో ఒక కార్మికుడు మృతి చెందగా 5 మంది గాయపడ్డారన్నారు. ఈ ప్రమాదాలను అదుపు చేయవలసిన యాజమాన్యాలు భద్రతను గాలికొదిలేసాయని మండి పడ్డారు. యాజమాన్యాలు కార్మికులకు అలాంటి రక్షణ రక్షణ కల్పించడం లేదన్నారు. ఈ ప్రమాదాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. జరిగిన ప్రమాదాలను యాజమాన్యాలు గోప్యంగా ఉంచడం, నిర్లక్ష్యం వ్యవహరించడం వల్లనే ప్రమాదాల తీవ్రత పెరుగుతుందని గనిశెట్టి పేర్కొన్నారు. ప్రమాదాలు అరికట్టడానికి అన్ని పరిశ్రమల్లోనూ భద్రత ఆడిట్ నిర్వహించి కార్మికుల విలువైన ప్రాణాలను కాపాడాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిపార్ట్మెంట్ అఫ్ కామర్స్ వారి ఆధ్వ ర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి హాజరై విద్యార్థులను ఉద్దేశించిమాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు తప్పనిసరిగా వినియోగదారులు యొక్క హక్కుల పైన, భారత ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ రకాల వినియోగదారుల చట్టాల పైన పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలనిసూచించారు. తద్వారా భారతదేశ ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందించే డిజిటల్ సేవా విభాగం పైన ప్రత్యేకమైనటువంటి పట్టు సాధించాలని, విద్యార్థులకు తెలిపారు.కామర్స్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ఎం. గోవిందరావు మాట్లాడుతూ భారతదేశ ప్రభుత్వం వినియోగదారుల చట్టం 1986 ని మార్పు చేస్తూ వినియోగదారుల చట్టం 2018 ప్రకారం వినియోగదారులకు ప్రత్యేకమైన అనేక హక్కులను మరియున్యాయపరమైనటు వంటి విధానాలను ఈ చట్టం ద్వారా కల్పించిందని విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ బి.లక్ష్మీ , తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎస్ .సత్యనారాయణ , మ్యాథమెటిక్స్ అధ్యాపకులు ఎం.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వల్ప స్థాయిలో భూ విలువలు పెంపుదల : జిల్లా రిజిస్ట్రార్

విశాలాంధ్ర - కే కోటపాడు : గ్రామీణ ప్రాంతాల్లో భూముల ఆస్తుల విలువ స్వల్పంగా పెరిగినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్టర్ కే మన్మథరావు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు రిజిస్ట్రేషన్ల విలువ పెంపుదలపై ఇప్పటికే సబ్ రిజిస్టర్ కార్యాలయాల వద్ద, వెబ్ సైట్ల లో ప్రదర్శించడం జరిగిందన్నారు. నక్కపల్లి చోడవరం లంకెలపాలెం సబ్ రిజిస్టర్ కార్యాలయాల పరిధిలో 20 నుండి 30 శాతం పెంచడం జరిగిందన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి జరగడం కొత్త ప్రాజెక్టులు ఆయా ప్రాంతాలకు రావడంతో మాత్రమే ఈ పెంపుదల చేసామన్నారు. మిగిలిన సబ్ రిజిస్టర్ పరిధిలో ఐదు నుండి 10 శాతానికి పరిమితం చేయడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఇప్పటికే భూములు మార్కెట్ విలువలు భారీగా ఉండటంతో అక్కడ కొత్తగా పెంపు ప్రతిపాదనలు చేయలేదని తెలిపారు. ఆయన వెంట స్థానిక సబ్ రిజిస్టర్ కే సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కామర్స్, ఈ-చెల్లింపులపై అవగాహన పెంచుకోవాలి: జాయింట్ కలక్టర్ ఎం.జాహ్నవి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : వినియోగదారుల చట్టం - 2019 పరిధిలోకి ఆన్లైన్ వినియోగదారులు కూడా వస్తారని జాయింట్ కలక్టర్ ఎం.జాహ్నవి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సం సందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ సమావేశం హాలులో 'వినియోగదారుల రక్షణ చట్టం'పై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూఈ-కామర్స్, ఈ-చెల్లింపులపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. అనైతిక వ్యాపార ధోరణులు, తప్పుదోవ పట్టించే ప్రకటనల పట్ల వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన బాధిత వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలన్నారు. బాధిత వినియోగ దారులు ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలోని వినియోగదారుల కమిషన్ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చని, నాణ్యత, సేవల్లోని లోపాలు, అక్రమ వ్యాపా రాలపై కూడా కమిషన్ను సంప్రదించ వచ్చని, బాధితులు నేరుగా లేకుంటే వారి ప్రతినిధుల ద్వారా కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు వినియోగదారుల రక్షణ చట్టంలో ఉందని ఆమె స్పష్టం చేశారు. అయితే కొనుగోలు చేసి వస్తువులకు బిల్లు తప్పనిసరిగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులు హక్కులపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. వినియోగ దారుల హక్కుల ఉల్లంఘనల నుంచి రక్షణ కొరకు, వస్తు సేవల్లో మోసపోయిన వినియోగదారులు నేషనల్ కన్స్యూమర్ హెల్ప్లైన్ నంబర్ 1915, ఏపీ ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నంబర్ 1967లను సంప్రదించాలని ఆమె సూచించారు. అ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లోనూ వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చని జాయింట్ కలక్టర్ జాహ్నవి స్పష్టం చేశారు. వినియోగదారుల కమిషన్ల అధ్యక్షులు జి.తనూజరెడ్డి, జి.వెంకటేశ్వరిలు మాట్లాడుతూ. వస్తు నాణ్యత, భద్రతల బాధ్యత తయారీ, ఉత్పత్తి, విక్రయ దారులపై విధిగా ఉంటుందన్నారు. కొనుగోలుదారు ప్రతి వస్తువుకు బిల్లు తీసుకో వాలన్నారు. నగదు చెల్లించి వస్తు సేవల్లో నష్టపోయిన వినియోగదారులకు వినియోగదారుల కమిషన్లు అండగా నిలుస్తాయన్నారు. చాలా మంది వినియోగదారులు అవగాహన లేక కమిషన్ను ఆశ్రయించకుండా నష్ట పోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రాధాన్యత, కేసు వేయు విధానం, వినియోగదారుల కమిషన్లో బాధిత వినియోగ దారులు సాధించిన విజయాలను వారు వివరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ) కనకమేడల వి.ఎల్.నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఔషధ నియంత్ర, పరిపాలన అసిస్టెంట్ డైరక్టర్ కె.విజయకుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ గెజిటెడ్ ఫుడ్ ఇనస్పెక్టర్ కె.సతీష్కుమార్, లీగల్ మెట్రాలజీ పరిశీలకులు డి.భాస్కరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బి.త్రినాధరాజు, ఎన్.సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సం సందర్భంగా 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం' అంశంపై జరిగిన వ్యాసరచన, డిబేట్ పోటీల్లో విజేతలకు జాయింట్ కలక్టర్ ఎం.జాహ్నవి బహుమతులను అందజేశారు.

అంబేద్కర్ పార్క్ అభివృద్ధి పట్ల కూటమి పార్టీల దళిత నాయకుల హర్షం

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలోని అంబేద్కర్ పార్క్ అభివృద్ధి పట్ల కూటమి పార్టీల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి విశాఖ ఉమ్మడి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వల్లా విలియం కేరి మాట్లాడుతూ సుమారు రూ. 3 కోట్లతో అంబేద్కర్ పార్క్ అభివృద్ధి చేస్తున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గా అంబేద్కర్ పార్క్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం నిధులు మంజూరు లేక పార్కు శిథిలావస్థకు చేరుకుందన్నారు. పార్కు అభివృద్ధితోపాటు, 500 మందికి సరిపడా ఆడిటోరియం, 30 అడుగుల అంబేద్కర్ విగ్రహం తదితర ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎంపీటీసీ కసింకోట సత్తిబాబు, ఇంజరపు సూరిబాబు, ఐ.ఎన్. మూర్తి, చిరుకూరి పేర్రాజు, గంపల చినరాజు, కువల కుమార్, బోడపాటి శ్రీను, ముంజులూరి దుర్గాప్రసాద్, తాటిపాక లోవరాజు, వల్లా ప్రసాద్, గారా చంటి, ఏడిద సురేష్, ఏమ్మిలి దుర్గా ప్రసాద్, బద్దా సూరిబాబు, కుంచే ప్రసాద్, సీకోలు కొండబాబు, జి. మోషే, మురళి తదితరులు పాల్గొన్నారు.

28న జరిగే మెగా జాబ్ మేళా ఏర్పాటు పనులు పరిశీలించిన నాయకులు

విశాలాంధ్ర - పాయకరావుపేట : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28 వ తేదీన శ్రీప్రకాష్ సంస్థలో జరిగే మెగా జాబ్ మేళా పనులను నాయకులు పరిశీలించారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సారధ్యంలో పాయకరావుపేటలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. ఈ మెగా జాబ్ మేళాలో 50 కంపెనీలు పాల్గొని, రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా, ఐటి కోర్స్ లో ఉత్తీర్ణత సాధించి, 18-40 ఏళ్ల నిరు ద్యోగ యువత శనివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వ హించే మెగా జాబ్ మేళాను వినియోగించుకోవాలని తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత naipunyam.ap.gov.in తప్పనిసరిగా నమోదు చేసుకొని, తప్పనిసరిగా అడ్మిట్ కార్డుతో పాటుగా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.అప్పన్న, సూపరిండెంట్ సి. హెచ్.ఆర్.కే. వర్మ, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ.ఆర్.కె.రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీఎం రమేష్ దృష్టికి కాలనీ సమస్యలు

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో నక్కపల్లి రాజీవ్ కాలనీలో గత 12 సంవత్సరముల నుండి వర్షాలు పడితే కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామని కాలనీలో ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కోసూరు శ్రీనివాసరావు మంగళవారం ఎంపీ సీఎం రమేష్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీను తెలిపారు. వీరితో పాటుగా సీఎం రమేష్ ను కలిసిన వారిలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పోలినాటి నానాజీ, మండల అధ్యక్షులు వేముల వెంకటరమణ, కనకరాజు, జోగినాయుడు, పాల్గొన్నారు.

పాసుపోర్టు పోయినది

అను శ్రీ హరిత శంకరశెట్టి D/o వెంకట నరసింహారావు పాయకరావుపేట గ్రామం, పాయకరావుపేట మండలం, అనకాపల్లి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నేను నా అసలు పాసుపోర్టు No:V4829852, 21-12-2024 తేదీన పాయకరావుపేట బస్టాండ్కు వెళుతుండగా పోగొట్టుకున్నాను. నా పాసుపోర్టు ఎవరికైనా దొరికి ఉంటే నాకు అందజేయగలరు.
నా ఫోన్ నెంబర్: 9951429848, 7013745245